క్లుప్తంగా

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దాతలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి నర్సాపురానికి చెందిన కె.సత్యనారాయణ, కాంచన దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు కోళ్లపర్రు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఆకివీడు: కోళ్ళపర్రులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా 14వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ శనివారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కోళ్లపర్రు, గుమ్ములూరు, తరటావ, అప్పారావుపేట, రాజులపేటలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

నేడు 'గూడెం' మండలంలో కేంద్ర బృందం పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగారాయుడిగూడెం, జగన్నాథపురం, కడియద్ద గ్రామాల్లో ఆదివారం ఉదయం కేంద్రం బృందం పర్యటించనున్నట్టు ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జలశక్తి అభియాన్, నారీ శక్తి సే జలశక్తి ప్రోగాంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారని తెలిపారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రాయల్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పూర్వ విద్యార్థులు తమ మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పెంటపాడ్ డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1975–78 బ్యాచ్‌లో పి.సత్యనారాయణ డిగ్రీ విద్యనభ్యసించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో కొట్టాడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన మిత్రులు, పూర్వ విద్యార్థులు రూ.1,05,000 సేకరించి సత్యనారాయణ కుటుంబానికి అందజేశారు. తొలుత స్నేహితుని మృతికి సంతాపం తెలియజేసి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కర్రి భాస్కర రావు, మండలి హనుమంతరావు, ముంగర కృష్ణప్రసాద్, వల్లూరి రవి, టి.సుబ్బారావు, పి.జానకిరామ్, జంధ్యాల నాగేశ్వరరావు, సీహెచ్ రాజబాబు హాజరయ్యారు.

వంతెన మార్గం ప్రమాదకరం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో రెండు వైపుఆలా కూడా రాళ్లు పైకి లేచిపోయాయి. అలాగే వంతెన రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు ప్రతిరోజూ పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎంతో కాలంగా ఈ వంతెన మార్గంవైపు రోడ్డుకు మర్మతులు చేయడంలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

నీరుగారుతున్న దాతల ఆశయం

- బస్‌షెల్టర్లలో తాండవిస్తున్న అపరిశుభ్రత
- ఆరుబయట వేచి ఉంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



శృంగవృక్షం బస్‌స్టాప్‌లో యాచకుడు తిష్ట వేయడంతో అధ్వాన్నంగా ఉన్న దృశ్యం



మోగల్లు బస్టాండ్‌లో పార్క్ చేసిన మోటార్‌సైకిల్

పాలకోడేరు: పది మందికి ఉపయోగపడాలనే సదాశయంతో దాతలు లక్షలాది రూపాయలు వెచ్చించి, నిర్మిస్తున్న బస్సు షెల్టర్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. స్థానిక సంస్థల నిర్లక్ష్యం దీనికి తోడై, పది మందికి ఉపయోగపడాల్సిన బస్సు షెల్టర్లు కొంతమందికి ఆశ్రయాలుగా మారుతున్నాయి. మోగల్లు గ్రామంలో పిన్నమరాజు బాపిరాజు, కుమారుడు సుబ్బరాజు కుటుంబ సభ్యులు కలిసి ఎండకు, వానకు ఇబ్బందిపడుతూ చెట్ల కింద బస్సుల కోసం నిలబడుతున్న ప్రయాణికుల సౌకర్యార్థం షెల్టర్‌ను నిర్మించారు. ఈ షెల్టర్‌ను ప్రయాణికులు వినియోగించుకోవడానికి కోవడానికి వీలు లేకుండా, చుట్టు పక్కల వాళ్లు తమ వాహనాలను, సామాన్లను అందులో డంప్ చేస్తున్నారు.

బస్ షెల్టర్‌లో యాచకుడి తిష్ట

శృంగవృక్షం గ్రామంలో దాత పబ్బతి అల్వాల రావు స్థలాన్ని కేటాయించగా, స్థానిక ఆర్య వైశ్య సంఘం సభ్యులు బస్ షెల్టర్ నిర్మించారు. అందులో ఒక యాచకుడు తిష్ట వేయడంతో ప్రయాణికులు భయపడి దూరంగా నిలబడి ఎండకు, వానకు అవస్థలు పడుతూ బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా భవనాలు నిర్మించే వరకూ దాతల పని. ఆ తర్వాత వాటిని సక్రమంగా నిర్వహించడం పంచాయతీల బాధ్యత. పంచాయతీ పాలకవర్గం, సెక్రటరీ వీటి వైపు చూడటం లేదు. వారి నిర్లక్ష్యం ఫలితంగా పది మందికీ ఉపయోగపడేలా లక్షల రూపాయలతో నిర్మించిన బస్ షెల్టర్లు అలంకారప్రాయంగా మిగులుతున్నాయి.

మనస్తాపంతో ఆత్మహత్య

ఉండి: భార్యపై మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండికి చెందిన సనకం నర్సింహస్వామి (48) తన భార్యతో మనస్పర్థల కారణంగా ఈ నెల 8వ తేదీన పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు అతడిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ నర్సింహస్వామి మృతి చెందాడు. అతని కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిక్కాల నరేష్ ఈ నెల 1న గల్ఫ్ దేశం మస్కట్ నుంచి ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో ఉంటున్న తన చిన్నమ్మ అలుగు విమల ఇంటికి వచ్చాడు. అనంతరం తన భార్యతో మనస్పర్థల కారణంగా ఈ నెల 6వ తేదీ శనివారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకూ ఆచూకీ లభించకపోవడంతో విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమ్మవార్లకు ఆషాఢ మాస సారె సమర్పణ



ఏలూరుపాడు వీధుల్లో అమ్మవార్లకు సారె సమర్పించేందుకు వచ్చిన మహిళా భక్తులు

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో కొలువు తీరిన అమ్మవార్లకు ఆషాడ మాసం సారె సమర్పణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ దేవతలైన పోలేరమ్మ, కొండాలమ్మ మహాలక్ష్మమ్మ,పుంతలో ముసలమ్మ, ఎల్లమ్మ, కనక దుర్గాదేవి అమ్మవార్లకు శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలకు ఆషాఢ మాస సారె బిందులతో గ్రామంలో పురవీధుల గుండా మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఉదయం 7:30 గంటలకు పోలేరమ్మ వారి గుడి దగ్గర నుంచి ఆషాఢ మాస అమ్మవార్ల సారె గ్రామ దేవతలు పోలేరమ్మ, ఎల్లమ్మ,కొండలమ్మ, మహా లక్ష్మమ్మ, పుంతలో ముసలమ్మ, కనక దుర్గమ్మ అమ్మ వార్లకు పసుపు, కుంకుమ, చీర జాకెట్, గాజులు, పువ్వులు, పండ్లతో పాటు సున్ని, చోడి జావ,బెల్లం మిఠాయి, పంచదార లడ్డు, రవ్వ లడ్డు, మురిపి, కాజా, మైసూర్ పాక్, తొక్కుడు లడ్డు, చలిమిడి, బూందీ, అన్ని రకములు కలిపి సుమారుగా 300 కేజీలు గ్రామ మహిళా భక్తులు గ్రామ దేవతలకు సమర్పించారు. అనంతరం పోలేరమ్మ వద్ద దగ్గర అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో పలువురు దాతల సహకారంతో 100 లీటర్ల పాలను వచ్చిన భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి, ఉండి మాజీఎమ్మెల్యేమంతెన రామరాజు సతీమణి మంతెన సుస్మా,గ్రామ సర్పంచ్ భూపతి రాజు జగ్గరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయరాజు, దాట్లశ్రీనివాసరాజు (సెక్యూరిటీ వాసు), దాట్ల సురేస్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు దాట్ల శ్రీనివాసరాజు, దాట్ల ప్రసాద్ రాజు, వక్కపట్ల హరిబాబు, రమణ, అమ్మవార్ల ఆలయకమిటీ సభ్యులు గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: మానవత సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, దాతలు పౌష్టికాహారం అందించడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, డాక్టర్ ఎం గోవిందబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన సంస్థ కార్యదర్శి వేమూరి రాంబాబుకు అభినందనలు తెలిపారు. సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అల్లు శ్రీనివాస్, కారుమూరి నర్సింహమూర్తి జీకేవీవీ ప్రసాద్, కేవీఎస్ఎన్ రాజు, చేకూరి జాన్సీ కముజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంకాళి మృతి



కోనాల మహంకాళి (ఫైల్)

ఉండి: ఉండి మండలం వాండ్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు కోనాల మహంకాళి(51) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా, సచివాలయ కన్వీనర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం బూత్ కన్వీనర్ పని చేస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా ఉంటుందని మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. మహంకాళి మృతికి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, కొర్రపాటి అనిత, సర్పంచ్‌లు కమతం సౌజన్యబెనర్జీ, గోగులమండ చినకృష్ణమూర్తి, నాయకులు జీ సుందర్‌కుమార్, గొంతే హరీష్, రంపా వెంకటేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఈది జాన్సన్‌ఎడ్వర్డ్, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, వాసుపల్లి విజయ్‌కుమార్, బాతు జాన్సన్, బొడ్డు నాగన్న తదితర ఎస్సీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

వ్యాధులకు చెక్ పెట్టండి



అయిభీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

ఆకివీడు: సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టే విధంగా ప్రజలు అప్రమత్తతతో ఉండాలని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు బి.గోవర్ధిని విజ్ఞప్తి చేశారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా శనివారం అయిభీమవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వస్తున్న అంటువ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, వెంకటలక్ష్మి, రత్న హిల్లరి, హెల్త్ అసిస్టెంట్ బండి దుర్గాప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నారుమడుల్లో వర్షపు నీటిని తొలగించాలి



తాడేరులో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: నారుమడులలో వర్షపు నీటిని బయటకు తొలగించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలం తాడేరు, బేతపూడి, రాయలం, గునుపూడి గ్రామాల్లో నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రస్తుత వర్షాలకు నారుమడుల చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేటట్లు చేయాలన్నారు. మడుల్లో వర్షపు నీటిని తొలగించి, నారుపై రెండు గ్రాముల కార్బన్‌డిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. భారీ వర్షం బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భీమవరం మండలం యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, కొత్తపూసలమర్రు, దొంగపిండి, నాగిడిపాలెం, రాయలం, అనాకోడేరు, కొమరాడ తదితర గ్రామాల్లో శనివారం 70 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం తుంపర పడటంతో పలువురు వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. నారుమడుల్లో ముంపు నీటిని రైతులు కారెంలు, ఆయిల్ ఇంజిన్లతో బయటకు తోడేందుకు నానా తంటాలు పడ్డారు. ఈ వర్షం వల్ల వనామీ రొయ్యలకు వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెంకన్న ఆలయాల్లో భక్తుల రద్దీ



వేములదీవి వేంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఏడు వారాల ప్రదిక్షణలు చేయడం, మొక్కుబడులు చెల్లించి, తలనీలాలను సమర్పించే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకు భక్తులతో కిక్కిరిసి ఉంది. స్వామివారిని తులసిదళాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: వశిష్టా గోదావరి తీరంలోని శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏడువారాల స్వామిగా పేరుగాంచడంతో ఇటీవల కాలంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. శనివారం తెల్లవారుజాము నుంచి కేదారీఘాట్‌లో పుష్కర్ ఘాట్‌లో భక్తులు స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ధ్వజంభం వద్ద దీపాలు పెట్టారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం



సైబర్ నేరాల పట్ల అవగాహన బ్యానర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లను శనివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్ డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ఆర్ఆర్‌డీఎస్ కళాశాల అధ్యాపకుడు పి.అమూల్యరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని అన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే సొమ్ములు రికవర్ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సైబర్ క్రైమ్ సంబంధించి అవగాహన కల్పించడానికి ప్రతి కూడలిలో బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లక్షన్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో శనివారం వేకువజాము నుంచి వారాహి అవతారంలో ఉన్న అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగహ నివారణకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన విశేషార్చనలో పాలకొల్లుకు చెందిన ఉనికిల దక్షిణామూర్తి, మద్దాల భానుమూర్తి, అడ్డాల వెంకట సత్యనారాయణ, తోట పాలాక్షుడు, కోయ జ్యోతి వీరరామ తులసి, వట్లిపులుసు వెంకటరమణ, జున్నూరు శ్యామల పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో తీర ప్రాంత గ్రామాల భక్తులు సుమారు 400 మంది అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.


రక్తదానంతో ఆరోగ్యానికి మేలు



స్థానిక షాదీఖానాలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్థానికులు

ఆకివీడు: రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు ఎండీ. బిలాల్ చెప్పారు. స్థానిక జమాతే ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో శనివారం షాదీఖానాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం ద్వారా కొంత మంది ప్రాణాల్ని కాపాడవచ్చునన్నారు. రక్తం అత్యవసరమైన వారికి ఆయా గ్రూపు రక్తం ఎక్కించి ప్రాణాలు నిలుపుతున్న ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. రక్తదానంతో దేహంలో కొత్త రక్తం పుట్టుకు వస్తుందని చెప్పారు. శిబిరంలో 62 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ అధ్యక్షుడు ఎస్‌డీ. ఫారూక్, డాక్టర్ ఏఎస్ఎస్.రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ.మస్తాన్‌వలీ, ఎండీ.జక్కీ అహ్మద్, లయన్స్ అహ్మద్, సంఘ సభ్యులు షహజాద్, మహబూబ్ జానీ, ఆరిఫ్, అతిఫ్, షబ్బీర్, అంజాద్ పాల్గొన్నారు.

పౌరుల హక్కులను హరించే విధంగా కొత్త క్రిమినల్ చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు అర్బన్: భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు స్వేచ్ఛ, సమానత్వం కల్పించిందని, ఆ హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించిందని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి విమర్శించారు. తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ జాజువుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశం ద్రోహంగా పరిగణించి క్రిమినల్ కేసును నమోదు చేసే కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని, రానున్న రోజుల్లో కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఉభయగోదావరి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. చట్టాలను ఆమోదించే క్రమంలో ముందుగా న్యాయవాదులతో ఎటువంటి చర్చలు నిర్వహించకుండా ఏకపక్షంగా కొత్త చీకటి క్రిమినల్ చట్టాలను ఆమోదించారని విమర్శించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, కోశాధికారి పి.వేణుగోపాలచౌదరి, జిల్లా కమిటీ సభ్యులు పీవీపీ లక్ష్మి, గెద్దాడ విజయభాస్కర్, పి.వెంకట్, పి.రాజారావు, డి.అప్పారావు పాల్గొన్నారు.